ప్రజాశక్తి



గ్యాస్ లబ్ధిదారులు 'కెవైసి' చేయించుకోవాలి

ప్రజాశక్తి-నెల్లూరు

గ్యాస్ కనెక్షన్ లబ్ధిదారులు ప్రతి ఒక్కరూ ఈకెవై సి (ఆధార్ అనుసంధానం) చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ అన్నారు. గురువారం దీపం - 2 పథకంపై జాయింట్ కలెక్టర్ ప్రత్యేక విలేకర్లతో మాట్లాడారు. గ్యాస్ కనెక్షన్ లబ్ధిదారులు ఈకెవైసి చేయిం చుకోకపోతే దీపం - 2 పథకానికి అనర్హులు అవుతారనేది అపోహ మాత్రమేనన్నారు. ఇందులో ఎటు వంటి నిజం లేదన్నారు. గతంలో దీపం -1 పథకంలోని లబ్ధిదారులు, ఉజ్వల, సిఎస్ఆర్, జనరల్ క్యాటగిరి అందరూ ప్రస్తుత పథకానికి అర్హులేనని, వారి అర్హతల మేరకు ఉచిత సిలిండర్ సదుపాయం పొందవచ్చునని తెలిపారు. జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకట రమణ ఉన్నారు.

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

నేటి నుంచి ప్రజా పోరు..!

14న కలెక్టరేట్, మండలాల్లో ఆందోళనలు - ప్రజా సమస్యలే అజెండా..

ప్రజా సమస్యలపై సమరానికి సిపిఎం సిద్ధమైంది. నూతన ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచింది. ఉచిత ఇసుక, అధిక ధరలు, మద్యం పాలసీలు, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు అనేక అంశాలపై ప్రభుత్వానికి సమయం ఇచ్చిన సిపిఎం ఉద్యమానికి సమాయత్తమైంది. ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలనే ప్రధాన డిమాండ్‌లతో నేటి నుంచి ప్రజల్లోకి వెళ్లనుంది. ప్రజా పోరు పేరుతో జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నారు. 14న కలెక్టరేట్ వద్ద భారీ నిరసనతోపాటు, అన్ని మండల కేంద్రాల్లో తహశీల్దారు కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించనున్నారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కదలి, ప్రజలతో మమేకమై, చైతన్యం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పిలుపు నిచ్చారు..



ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం మళ్లీ ప్రజల్లోకి వెళ్లనుంది. ఎన్నికల తరువాత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కావడం లేదు. ప్రధానంగా ఎన్నికల తరువాత ప్రజల జీవన విధానంలో అనేక మార్పులొచ్చాయి. రోజు రోజుకు నిత్యావసర ధరలు పెరుగుతున్నాయి. టమోటా, పప్పులు, ఆకు కూరలు, ఎర్రగడ్డలు ఒక్కటేమిటి అన్ని ధరలు పెరుగుతూ పోతున్నాయి. ధరల నియంత్రణకు ప్రత్యేక నిధులు కేటాయించి అదుపు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వ ఆ దిశగా ఏలాంటి ఏర్పాట్లు చేస్తున్నట్లు కనిపించడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొలువు తీరి ఐదు నెలలు గడిచాయి. వంట నూనెల ధరలు అదుపులో లేకుండా పోయాయి. ప్రతి 15 రోజులకోసారి ధరలు పెరిగుతూ పోతున్నాయి. మరో వైపు ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక, మద్యం పాలసీ ప్రజలకు పెద్దగా ఉపయోగం లేదు. నివాస ప్రాంతాల్లో షాపులు పెట్టడం, దానికి అనుబంధంగా బెల్ట్ షాపుల ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళలను లక్షాధికారులను చేస్తామని చెప్పే సిఎం చంద్రబాబునాయుడు రోజంతా కష్టపడి సంపాదించిన డబ్బును భర్తలు మద్యం షాపులకు తగలేస్తే, లక్షాధికారులను ఎలా తయారుచేస్తారో చూడాలి. సామాన్య, మధ్య తరగతి ప్రజల జీతాలకు, పెరుగుతున్న ధరలకు ఎక్కడా పొంతన లేకుండా పోతుంది. విద్యార్థులకు ఫీజులపై నియంత్రణ లేదు. ధరలు అదుపులో లేవు., ఇలా ప్రజల జీవనం సవ్యంగా సాగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఉప్పు, పప్పు, నూనె, ప్రతి వస్తువు అందుబాటులో ఉండడం లేదు. ఈ విషయాలను ప్రజల ముందు ఉంచడానికి సిపిఎం గ్రామ గ్రామాన ప్రచారం చేయనుంది. ప్రభుత్వ ధరలు అదుపులోకి తీసుకొచ్చి, అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆందోళనకు సిద్ధమైంది. నేటి నుంచి గ్రామీణ, మండల, వార్డులు, తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేయనున్నారు. ఈనెల 14న కలెక్టరేట్ వద్ద నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్ డివిజన్ శాఖలు ఆధ్వర్యంలో నిరసన తెలపనున్నారు. అదే రోజు జిల్లావ్యాప్తంగా మండల కేంద్రాల వద్ద తహశీల్దారు కార్యాలయాల వద్ద ధర్నాలు చేయనున్నారు.

ప్రజా పోరు సాగించండి..

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ప్రజలు ఎదుర్కొంటున్న అధిక ధరలు, ఇతర సమస్యలపై ప్రజా పోరు పేరుతో నేటి నుంచి జిల్లా వ్యాపితంగా సాగే ప్రచార కార్యక్రమంలో పార్టీ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పిలుపు నిచ్చారు. ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన హామీలను నెలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు జీవించే విధంగా ధరలు నియంత్రించాలని డిమాండ్ చేశారు. 14న కలెక్టరేట్, మండల కేంద్రాల్లో జరిగే ధర్నాలు విజయవంతం చేయాలని కోరారు.

డిఎస్‌పికి అభినందనలు తెలుపుతున్న 'బుర్రా'

డిఎస్‌పికి 'బుర్రా' శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కందుకూరు : నూతనంగా కందుకూరు డిఎస్‌పీగా బాధ్యతలు స్వీకరించిన బాల సుబ్రహ్మణ్యంని గురువారం ఆయన కార్యాలయంలో కందుకూరు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కందుకూరు నియోజకవర్గంలోని పలు సమస్యలపై విన్నవించి పరిశీలించి తగిన న్యాయం చేయాలని కోరారు.కందుకూరు నియోజకవర్గంలోని సోషల్ మీడియా కార్యకర్తలపై నమోదు చేస్తున్న కేసులను పరిశీలించి వాటిపై అక్రమ కేసులు నమోదు చేయకుండా తగిన చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇసుక దందాపై చర్యలు చేపట్టాలన్నారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ తోకల కొండయ్య, రాష్ట్ర నాయకులు గణేష్ గంగిరెడ్డి, న్యాయవాది ముప్పవరపు కిషోర్, వైఎస్‌ఆర్‌సిపి నాయకులు చీమల వెంకటరావు, రేణమాల అయ్యప్ప, దగ్గుమాటి కోటయ్య, షేక్ రహీం, షేక్ బికారి, గోగినేని రామాంజనేయులు,షేక్ అబ్దుల్ కలాం ఉన్నారు.

అండర్ బ్రిడ్జి పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు : నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా గురువారం స్థానిక ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ డ్రైన్ కాలువ లీకేజీ ద్వారా అండర్ బ్రిడ్జి ప్రాంతం మురుగునీటితో నిండిపోయి పాదచారులు వాహన చోదకులకు ఇబ్బందిగా మారిన పరిస్థితి ప్రత్యక్షంగా పరిశీలించారు. స్పందించిన కమిషనర్ భూగర్భ డ్రైనేజీ యంత్రాల సహాయంతో అండర్ బ్రిడ్జి ప్రాంతంలోని మురుగునీటి మొత్తాన్ని తోడించి వేశారు.

రూ.80 కోట్లతో ఉపాధి హామీ పనులు

ప్రజాశక్తి-కలిగిరి

జిల్లాలో సుమారు 80 కోట్లతో ఉపాధి హామీ పథకం కింద పలు అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతున్నట్లు కలెక్టర్ ఆనంద్ చెప్పారు.గురువారం మండలంలో పర్యటించిన కలెక్టర్, ఉపాధి హామీ పనులు జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. తొలుత మండలంలోని వెలగపాడు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న క్యాటిల్ షెడ్ (మినీ గోకులం) పనులను పరిశీలించారు. లబ్ధిదారుడితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి హామీ పథకం కింద మంజూరై సాగులోని నిమ్మ తోటను పరిశీలించారు. నిమ్మ తోట పంటకాలం, దిగుబడి, మార్కెటింగ్, ఆదాయం మొదలైన విషయాలను రైతు విరిమయ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ నిమ్మ తోటకు డ్రిప్ ఇరిగేషన్ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపీడీఓ, పంచాయతీ సెక్రటరీ నాయకులు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-నెల్లూరు

విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో (ఎఐఎస్ఎఫ్, ఎస్ ఎఫ్ ఐ, పి డి ఎస్ యు, ఎఐఎస్బి, వైఎస్ఆర్ స్టూడెంట్ విభాగం) డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నాయకులు ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ వైయస్సార్ విద్యార్థి విభాగం జిల్లా నగర అధ్యక్షులు షేక్ యాదవ్,పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు సునీల్, ఎఐఎస్బి రాష్ట్ర అధ్యక్షులు వివిఎస్ చైతన్య, ఎస్ ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ కరీముల్లా మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్,ప్రైవేటు పాఠశాలలు విచ్చలవిడిగా ప్రభుత్వ నియమాలను తుంగలో తొక్కి వారి ఇష్టానుసారంగా తరగతులు నిర్వహిస్తున్నారు. లక్షల రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేసుకుంటూ బలవంతపు చదువులను విద్యార్థులపై రుద్దుతూ వారి మరణాలకు కారణమవుతున్నారని విమర్శించారు. ధనలక్ష్మీపురం వద్ద గల విబిఆర్ పాఠశాలలో ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకుని చనిపోవడానికి కారణం ఆ పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి అని విద్యార్థి సంఘాల ఐక్య వేదిక నాయకులు ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్రంగా విచారించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఎఐఎస్ఎఫ్, ఎస్ ఎఫ్ ఐ, పి డి ఎస్ యు, ఎఐఎస్బి, వైఎస్ఆర్ స్టూడెంట్ విభాగం, ఎస్ ఎస్ ఎఫ్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాలు

అడవిరాజుపాలెంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ : అడవి రాజుపాలెంలో విష జ్వరాలు అనే కథనం బుధవారం ప్రజాశక్తిలో కథనం వచ్చింది. దీనిపై అధికారులు స్పందించారు. అడవిరాజు పాలెంలో గురువారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. తొలుత ప్రతి గృహాన్ని సందర్శించి జ్వరపీడితులను గుర్తించారు. పలు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలకు వైద్యాధికారి సూచనలు చేశారు. గ్రామీణ ప్రజలు సీజన్ మార్పుకాలంలో తీసు కోవాల్సిన చర్యలను వివరించాలని వారికి సూచించారు. సిహెచ్ఓ భాస్కరరావు, అరుణ, శ్రీ లక్ష్మీ, సుల్తాన్ హెల్త్ అసిస్టెంట్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రుణాల మంజూరుపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలు పొందే వివరాలపై అవగాహన కల్పించి అర్హులైన బందాలకు రుణాలు మంజూరు చేయాలని మెప్మా సభ్యులను నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సూచించారు. ఎస్.హెచ్.జి.ప్రొఫైలింగ్ యాప్ (సెల్ఫ్ హెల్ప్ గ్రూప్) నిర్వహణపై మెప్మా విభాగం సిబ్బందికి నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో రెండు రోజుల పాటు శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. అదనపు కమిషనర్ నందన్ మాట్లాడారు. మెప్మా పిడి, రవీంద్ర ,నగరపాలక సంస్థ టి.పి.ఆర్.ఓ. బాలకష్ణ, మేప్మా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు సరికాదు : కాంగ్రెస్

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణం తగ్గించకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని కాంగ్రెస్ పార్టీ సిటీ నియోజకవర్గ ఇన్చార్జి నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.నగరంలోని మినీ బైపాస్ మిలీనియం సబ్‌స్టేషన్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెరిగిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా గురువారం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి నరేష్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు జీ. శ్రీరాములు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మోహన్ ఉన్నారు.

అయ్యవారిపల్లెలో చోరీ

ప్రజాశక్తి వలేటివారిపాలెం : మండలంలోని సుండి అయ్యవారిపల్లి గ్రామంలోని పట్టపగలే చోరీ జరిగింది. ఎస్ఐ మరిది నాయుడు తెలియజేసిన వివరాల ప్రకారం చుంచి అయ్యవారిపల్లిలో ఉదయం సుమారు 9: 30 గంటల ప్రాంతంలో అయ్యవారిపల్లి గ్రామంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్ మీద వచ్చారు. మద్దులూరి ప్రభాకర్ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తలుపు గడి తొలగించి ఇంట్లో బీరువాలో ఉన్న బంగారపు వస్తువులను అపహరించారు. వెంటనే బైక్‌పై పారిపోయారు. దీనిపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనిల్‌రెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి -ఉలవపాడు : మండలంలోని బద్దిపూడి గ్రామ సర్పంచి దివంగత కూనం అనిల్ రెడ్డి దశదిన కర్మ గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు మాజీ శాసనసభ్యులు, మాజీ ప్రభుత్వ ఉద్యోగులు మండల నాయకులు కార్యకర్తలు ప్రజలు అభిమానులు పాల్గొన్నారు. ముందుకు అనిల్‌రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అనిల్‌రెడ్డిసోదరుడు రాఘవరెడ్డిని పలువురు పరామర్శించారు. కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. కావలి మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాపరెడ్డి, కందుకూరు వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్, ప్రకాశం జిల్లా పూర్వ కలెక్టర్ విజయ్‌కుమార్, మండల నాయకులు కూనం బ్రహ్మానందరెడ్డి, కేశవరపు. జాలి రెడ్డి, సిహెచ్ .చెంచురామిరెడ్డి, చేజర్ల వెంకటరామిరెడ్డి, తోకల కొండయ్య , జి. గంగిరెడ్డి, ఎన్. పోతురాజు పాల్గొన్నారు.

అనిల్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రత్యేక పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పురపాలక సంఘం కమిషనర్ అనూష ఆదేశాల ప్రకారం గురువారం కందుకూరు పట్టణంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. శ్రీనగర్ కాలనీ, అజ్మల్ హుస్సేన్ హాస్పిటల్ రోడ్ ,తెల్లప్రోలు వారి వీధి ,పెద్ద బజారు ,గ్రంథాలయం వీధి ,జనార్ధన్ కాలనీ, సాయిబాబా గుడి ఏరియా, ఆర్డీఓ ఆఫీస్ బ్యాక్ సైడ్ ,ఖాజీపాలెం, బండపాలెం తదితర ఏరియాల్లో యాంటీ లార్వేల్ ప్రేయింగ్ చేయించారు.

కుట్టు మిషన్లు పంపిణీ

నెల్లూరు : కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు భక్తవత్సల నగర్ లోని జనహిత వాత్సల్య అనాధ శరణాలయానికి రూ. 2 లక్షల విలువైన ఎనిమిది ఎలక్ట్రికల్ కుట్టు మిషన్లను అందజేస్తున్నట్లు స్టేట్ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ లేఖ మీనన్ పేర్కొన్నారు. గురువారం జనహిత వాత్సల్య అనాధ శరణాలయం నిర్వాహకులకు ఎలక్ట్రికల్ కుట్టు మిషన్లు అందజేశారు. స్టేట్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్ శేషగిరి, ఆలయ ఇఒ శ్రీనివాసరెడ్డి, జనహిత వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరీ జీవి సాంబశివరావు ఉన్నారు.

ఇరు గ్రూపులు ఘర్షణ

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక వెంకటేశ్వరపురం ప్రాంతంలో ఓ స్థల వివాదంలో టిడిపికి చెందిన ఓ మాజీ కార్పొరేటర్ భర్త జహీర్, వైసిపి కార్పొరేటర్‌గా గెలుపొంది ప్రస్తుతం టిడిపి కండువా కప్పుకున్న కార్పొరేటర్ ముజీర్ వర్గాలు పరస్పర దాడులకు పాల్పడ్డాయి. మాజీ కార్పొరేటర్ భర్త, ప్రస్తుత కార్పొరేటర్ ఘటర్షణలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వారిద్దరని వైద్యం కోసం వేర్వేరు వైద్యశాలల్లో చేర్పించారు. తొలుత దాడి సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోని ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మాజీ కార్పొరేటర్ భర్త జహీర్, అతని సోదరుడు ఇద్దరు రక్తపు గాయాలతో జిజిహెచ్‌కి వెళ్లినట్లు సమాచారం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మెరుగైన చికిత్స నిమిత్తం అపోలో వైద్యశాలకు తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ హుటా హుటిన అపోలో వైద్య శాలకు చేరుకున్నారు. ఒక రహదారి నిర్మాణం జరుగుతున్న సమయంలో సొంత పార్టీలో ఉన్న ప్రత్యర్థి వర్గానికి చెందిన వారు ఇటువంటి దాడులకు పాల్పడటం మంచిది కాదన్నారు. ఈ ఘటనపై మంత్రి నారాయణకు దృష్టికి తీసుకెళ్తానన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.



చికిత్స పొందుతున్నజహీర్‌ను పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం..

టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి : టిడ్కో ఇళ్ల వద్ద జరిగే అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ పేర్కొన్నారు. భగత్ సింగ్ కాలనీ టిడ్కో ఇళ్ల వద్ద ఇటీవల అత్యాచారం జరిగిన మైనర్ బాలిక బాధిత కుటుంబాన్ని ఎపి టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ కాలనీ పోకిరీలకు అడ్డాగా మారిందని.. చెత్తాచెదారం పేరుకుపోయిందని, పరిసర ప్రాంతంలో అసాంఘిక కార్యక్ర మాలు జరుగుతున్నాయని కాలనీవాసులు ఆవేదన చెందారు. దీనిపై వారు మాట్లాడుతూ అత్యాచార నిందితులను టిడ్కో ఇళ్లలో జరిగుతున్న అసాంఘిక కార్యక్రమాలను పరిశీలించడానికి వస్తే ఒక్క పోలీస్ అధికారి కూడా రాకపోవడాన్ని అజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సి ఐకి ఫోన్ చేసి పిలిపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వం సహిం చలేదన్నారు. ఎపి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పోలీస్ వ్యవస్థ నిర్లిప్తతపై మాట్లాడారన్నారు. అసాంఘిక కార్యకలాపాల నివారణకు నిత్యం గస్తీనిపెంచాలన్నారు. సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ గారి చేతుల మీదుగా బాధిత మహిళ కుటుంబానికి 10,000 ఆర్థిక సాయం అందజేశారు. సుందరామి రెడ్డి, గునుకుల కిషోర్, లాయర్ శ్రీరామ్, కష్ణారెడ్డి, రవి, గుర్రం కిషోర్,కాకు మురళి రెడ్డి,శ్రీను ముదిరాజ్,కోలా విజయ లక్ష్మి, నాగ రత్నమ్మ, నందిని, ప్రసన్న, హసీనా, శాంతికల,జనసేన నాయకులు వీరామహిళలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న అజయ్‌కుమార్

కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-కందుకూరు : ఈనెల 24న ప్రకాశం జిల్లా ఒంగోలు అంబేద్కర్ భవన్ లో బైద్ధ దీక్ష ఉత్సవం జరుగుతుంది. ఆ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని పట్టణములోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ కూడలి వద్ద గురువారం ఆవిష్కరించారు. బౌద్ధ, అంబేద్కర్ సంఘాల నాయకులు ఆవి ష్కరణ కార్యకంలో పాల్గొన్నారు. బిఎస్ఐ రాష్ట్ర అధ్యక్షులు వెలిచెర్ల హరిబాబు, అధ్యక్షత వహించిన ధమ్మచక్ర ఫౌండేషన్ అధ్యక్షులు జి హరిప్రసాద్ మాట్లాడారు.

పరీక్షల కేంద్రంలో తనిఖీ చేస్తున్న విసి ఎస్ విజయ్ భాస్కరరావు

పరీక్ష కేంద్రంలో ఉపకులపతి తనిఖీ

ప్రజాశక్తి -వెంకటాచలం : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని నెల్లూరు నగరంలో ఉన్న విఆర్ కళాశాలలో గురువారం జరిగిన 'లా' మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షలను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎస్. విజయ భాస్కర రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విఆర్ ఐ.ఎ.ఎస్ కళాశాలలో ఏర్పాటుచేసినా 'లా' పరీక్షకేంద్రంలో పరీక్షల నిర్వాహకులు విద్యార్థులకు కల్పించిన మౌలిక వసతులు, విద్యార్థులు హాజరు, అధ్యాపకులు పనితీరు, పరీక్షలు జరుగుతున్న విధానాన్ని విసిపరిశీలించారు. అనంతరం మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా అత్యంత పగడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని ఇన్విజిలేటర్లకు విసి ఎస్ విజయ భాస్కరరావు సూచించారు.

డిప్యూటీ డిఇఒకు అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు డిప్యూటీ డిఇఒగా ఎం జానకిరామ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కందుకూరు డివిజన్ యూటియఫ్ నాయకులు ,కందుకూరు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దామా కొండపు నాయుడు , చిత్తారు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి పొన్నగంటి వెంకటేశ్వర్లు నాయకులు ముప్పరాజు కోటేశ్వరరావు,కె కృష్ణరెడ్డి, సందాని భాషా. రమేష్,పవన్, వివి రవి, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అభినందనలు తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

డిఎంహెచ్‌ఓ కార్యాలయంలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-నెల్లూరు :

నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణంలోని పాత డిఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. దోమల నివారణకు మలేరియా విభాగం అయిల్ బాల్స్‌ను తయారు చేసేందుకు నిల్వ చేసి ఉంచిన మడ్డిఅయిల్ క్యాన్‌లు అగ్నికి అహుతయ్యాయి. ఒక్క సారిగా మంటలు ఎగసి పడటంతోకార్యాలయంలో ఉన్న అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురై అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందజేశారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది రెండు ఫైరింజన్లతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి వి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆయిల్ బాల్స్ తయరు చేసేందుకు వాడే మడ్డి అయిల్ నిల్వ చేసిన క్యాన్లు అగ్నికి ఆహుతైనట్లు గుర్తించామన్నారు. వ్యవహారంపై పోలీసులకు సమాచారం అందజేస్తామని, వారి విచారణలో అగ్ని ప్రమాదం ఆకతాయిల పనా..అనేది తేలుతుందన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టరు ఎం.పెంచలయ్య తెలిపారు.

ముందస్తు పరీక్షలతో కేన్సర్ నివారణ

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రస్తుతం ప్రజలకు సంభవిస్తున్న వ్యాధులలో 60 శాతానికి పైగా అసంక్రామిక వ్యాధులని, అందులో కాన్సర్ మహమ్మారి ఒకటి అని డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టరు మల్లి పెంచలయ్య పేర్కొన్నారు. గురువారం జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీని నిర్వహించారు.ఈ ర్యాలీని ఎసిఎస్ఆర్ మెడికల్ కళాశాలలో డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టరు ఎం.పెంచలయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచి కరెంట్ ఆఫీస్ వరకు నిర్వహించారు. డి.యం.హెచ్.ఓ డాక్టరు. ఎం.పెంచలయ్య మాట్లాడుతూ ప్రజలు ధూమపానం, గుట్కాలకు దూరంగా ఉండాలన్నారు. కాన్సర్ నివారణలో భాగంగా ఈనెల 14 వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 18 సంవత్సరాలు పైబడిన వయస్సు వారందరికి ఇంటివద్దే వైద్య ఆరోగ్య సిబ్బందిచే ఉచిత కాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.డిఎల్ఏటిఒ షేక్ ఖాదర్ వలి, పిఒఆర్‌బిఎస్‌కె డాక్టరు.సుధీర్ కుమార్, డిపిఎంఒ డాక్టరు.రమేష్, డెమో కె.కనకరత్నం, వైద్యాధికారులు డా.ప్రమోద్, డా.నవీన్, ఎన్‌సిడి విభాగం సిబ్బంది, కమ్యూనిటి పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దిలీప్ నర్సింగ్ స్కూల్ కరస్పాండెంట్ దుర్గారెడ్డి ఉన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

నేటి నుంచి కార్తీక లక్ష దీపోత్సవాలు

ఏర్పాట్లు పరిశీలించిన వేమిరెడ్డి దంపతులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి : ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు ఆధ్వర్యంలో నేటి నుంచి మూడు రోజులు కార్తీక మాస లక్ష దీపోత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి,ఆర్.సి మైదానంలో నిర్వహించనున్న కార్తీక మాస లక్ష దీపోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మైదానం అంతా కలియతిరుగుతూ ఏర్పాట్లను పరిశీలించారు. పెండింగ్ పనులపై కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. తాము రాజకీయాల్లోకి రాక ముందు నుంచి గత 8 సంవత్సరాలుగా కార్తీక మాస లక్ష దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది మరింత వైభవంగా కార్తీక మాస లక్ష దీపోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నాసిక్‌లోని త్రయంబకేష్వర్ ఆలయ నమూనా, అయోధ్య రామాలయం నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భాస్కర్ శర్మ, ప్రభాకర్‌రావు, గంధం సునీల్, విజయసారధి, అర్చకులు పవన్ శర్మ, ఇతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌సిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు

డివైఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక 17 డివిజన్ శాఖ పరిధిలో డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. డివైఎఫ్ఐ మాజీ నాయకుడు ఎస్.కె నజీర్ జెండా ఆవిష్కరించారు.ఆయన మాట్లాడుతూ డివైఎఫ్ఐ సంఘంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు మంచి నడవడికను అలవాటు చేసుకోని క్రమ శిక్షణకు డివైఎఫ్ఐ సంఘాన్ని అభివద్ధి చేయాలని పిలుపునిచ్చారు.

17వ డివిజన్‌లో..

చవటమిట్ట ప్రాంతంలో.. డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా 31 డివిజన్ చవటమిట్ట ఎగువ ప్రాంతంలో డివైఎఫ్ఐ జెండా 31 డివిజన్ డివైఎఫ్ఐ కార్యదర్శి మాదాసు ముత్యాలు ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు. డివైఎఫ్ఐ రూరల్ కార్యదర్శి గోను చైతన్య, సిపిఎం నెల్లూరు రూరల్ కార్యదర్శివర్గ సభ్యులు కొండ ప్రసాద్‌మాట్లాడారు. సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు బి నాగేశ్వర్ రెడ్డి 31 డివిజన్ సిపిఎం శాఖ కార్యదర్శి మల్లా సుధాకర్, మా బాషా, రమణయ్య వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు : టి ఆర్ ఆర్. ప్రభుత్వ. జూనియర్ కళాశాల. బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక టిఆర్‌ఆర్ క్రీడా మైదానంలో. గురువారం జరిగింది. పురుషుల విభాగంలో. సుమారు. 30 మంది పాల్గొన్నారు. స్త్రీల విభాగంలో. మారు 20 మంది పాల్గొన్నారు. వీరిలో. నైపుణ్యం కలిగిన. 16 మంది. పురుషులను. 14 మంది. స్త్రీలను. జిల్లా జట్టుకి. ఎంపిక. చేశారు. ఈ జట్లు. పశ్చిమగోదావరి జిల్లా. . మార్టేరులో జరిగే రాష్ట్రస్థాయి. పోటీలలో. పాల్గొంటాయని అసోసియేషన్. ప్రెసిడెంట్. వలేటి . రవీంద్ర, సెక్రెటరీ. సుబ్బారావు తెలిపారు. సోమినేని సురేష్. సయ్యద్ జిలాని భాష. కళాశాల ప్రిన్సిపాల్. ఓ వెంకటేశ్వరరావు ఉన్నారు.

సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి-కందుకూరు : ఎంఎల్ఏ ఇంటూరి నాగేశ్వరరావు సహకారంతో సిఎం సహాయ నిధి (ఎల్ఒసి)ని బాధిత మహిళకి గురువారం టిడిపి నాయకులు అందజేశారు. మండలం బలిజిపాలెం గ్రామానికి చెందిన దారా కళ్యాణి అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యం నిమిత్తం నిమ్స్ హాస్పిటల్ కి వెళ్లగా వారు ఆపరేషన్ చేయాలని సూచించారు. గ్రామస్తులు, స్థానిక నాయకుల ద్వారా దారా కళ్యాణి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కలిశారు. తక్షణం ఎంఎల్ఏ సిఎం సహాయ నిధి ద్వారా ముందుగా ఆపరేషన్ చేయిం చుకునేందుకు రూ. 2 లక్షల అనుమతికి మంజూరు పంపించారు. గురువారం కార్యాలయంలో దారా కళ్యాణికి కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు చేతుల మీదుగా సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్ఓసిని అందజేశారు. కళ్యాణి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు బలిజిపాలెం పార్టీ నాయకులు ఏకాంబరం వెంకటరావు, సాధు వేణు పాల్గొన్నారు.

శ్రీశైలం, అరుణాచలం క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-కావలి:కార్తీకమాసం సందర్భంగా భక్తులు, ప్రజల కోరిక మేరకు ప్రముఖ శైవక్షేత్రాలైన పంచా రామాలు, శ్రీశైలం, అరుణాచలం లకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు.శ్రీశైలం నందు వెలసి ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దర్శనార్థం, కావలి డిపో నుండి ప్రత్యేక బస్సులు నవంబర్ ఆదివారాలు 10, 17, 24 తేదీలలో కావలి నుండి బయలు దేరి, సోమవారం స్వామి దర్శన అనంతరం శ్రీశైలం నుండి తిరిగి కావలికి బయలుదేరును.టికెట్ ధర పోను రాను 850 రుపాయలు మాత్రమే అని, నెంబర్ 94472 తో ఆన్లైన్ రిజర్వేషన్ పొందవచ్చని వివరించారు.కార్తీకమాసం సందర్భంగా అరుణాచలం గిరి ప్రదక్షిణకు, నవంబర్ 14వ తేదీ నాడు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామని సర్వీస్ నెంబర్ 94472 ఆన్లైన్రిజర్వేషన్పొందవచ్చని,టికెట్ ధరపోనురాను 1400రూపాయలు అని అన్నారు.పంచారామ క్షేత్రా లైన అమరారామం – అమరేంద్రుని ప్రతిష్ట (అమరావతి) సోమరా మం – చంద్రుని ప్రతిష్ట, భీమవరం (పశ్చిమగోదావరి) క్షిరారామం – మహా విష్ణువు ప్రతిష్ట, పాలకొల్లు (పశ్చిమ గోదావరి) ద్రాక్షారామం –దక్షుని ప్రతిష్ట, ద్రాక్షారామం (తూర్పు గోదావరి) కుమారా రామం – కుమారస్వామి ప్రతిష్ట, సామర్లకోట(తూర్పుగోదావరి) సోమవారం ఒకే రోజులో దర్శనం చేసుకునే విధంగా నవంబర్ 10,17, 24 తేదీలలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని, ఆదివారం రాత్రి కావలి నందు బయలుదేరి, సోమవారం పంచారామ క్షేత్రాల నందు దర్శనం చేసుకుని స్వామి వార్ల ఆశీస్సులు పొందగలరని అయన పేర్కొన్నారు. టికెట్ ధర 2200 రూపాయలు, రిజర్వేషన్ సర్వీస్ నెంబర్ 95030 అని,టికెట్ బుకింగ్ చేసుకోదలచిన వారు కావలి బస్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ లో కూడా టిక్కెట్లు పొందవచ్చని డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు వివరించారు.

జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-వరికుంటపాడు:మండలంలోని గణేశ్వరాపురం గ్రామంలో ఎంఆర్పిఎస్ మండల ఇన్ఛార్జ్ తాతపూడి డేవిడ్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పందిటి అంబేద్కర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనకు గత 30 సంవత్సరాలు పోరాటం మనకు ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన ఎమ్మార్పీఎస్ జండా ఆవిష్కరణ చేయడం సంతోషకరమన్నారు. నవంబర్ 12 వ తేదీన నెల్లూరుకు వస్తున్న సందర్భంగా ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అనంతరం మొట్టమొదటిసారిగా మన జిల్లాకు వస్తున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బకీరు జాషువా, బెజవాడ బాల గురవయ్య, గోచిపాతల ఆనంద్ రావు, కాకి అంకయ్య, అంకి యేసు రత్నం, నాగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న..

శిలాపలకం ధ్వంసం

ప్రజాశక్తి దగదర్తి:స్థానిక మెయిన్ రోడ్డు నుంచి దగదర్తి తహశీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్ స్టేషన్లను కలుపుతూ శనివారం ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి మూడు సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన నిర్వహించ తలపెట్టిన శిలా ఫలక స్తూపాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలెపాటి సుబ్బనాయుడు ఆదేశాల మేరకు వారి అనుచరులు గురువారం ధ్వంసం చేశారు. స్థూపాన్ని నిర్మిస్తున్న మేస్త్రిని భయభ్రాంతులకు గురి చేసి, మండలంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం లేదని, కాదని చేపడితే ఇలాంటి గతే పడుతుందని, వారి అంతు చూస్తామని బెదిరించడం జరిగింది. ఇక్కడ ఎవరూ ఎలాంటి పనులు చేయాల్సిన అవసరం లేదన్నారు. . ఈ విషయమైతెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి తెలిపారు.

జాతీయ పశుగణన

ప్రజాశక్తి-వింజమూరు:స్థానిక సబ్ డివిజన్ పరిధిలో 21వ జాతీయ పశు గణన కార్యక్రమం జరుగుతున్నదని పశు సంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ కె. రఘునాథ్ తెలిపారు వింజమూరులోని పశు వైద్యశాల కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఈ జాతీయ పశుగణన కార్యక్రమం ఈనెల ఒకటి నుండి వచ్చే నెల 28వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. ఈ సబ్ డివిజన్ పరిధిలోని వింజమూరు, ఎఎస్పేట మండలాల్లో ఈ కార్యక్రమం ప్రారంభమైందని తెలిపారు. ముఖ్యంగా పశు వైద్య శాఖ సిబ్బంది లైవ్ స్టాక్ యానిమేటర్ ప్రతి రైతూ ఇంటికి వెళ్లిపూర్తి వివరాలను యజమాని పేరు, కులం, క్యాటగిరి కలిగియున్న వివిధ రకాల పశువుల గణన సేకరించి మీ ఇంటికి ఒక స్టిక్కర్ అంటించడం జరుగుతుందని తెలిపారు. .కార్యక్రమంలో డాక్టర్ కె.రఘునాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

పంటలను సాగు చేసుకోవాలి

ప్రజాశక్తి-ఉదయగిరి:గ్రామాల రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆంజనేయుల నాయక్ పేర్కొన్నారు. గురువారంఅప్ప సముద్రం గ్రామంలో రైతు సేవ కేంద్రంలో పొగాకు రైతులతో పంట మార్పిడి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటలుగా శనగ, కంది, మినుము, పెసర, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, నువ్వులు, జనుము మొదలైన పంటలు నూతన వంగడాల వివరాలు యాజమాన్య పద్ధతులు, దిగుబడి, సరాసరి ధర మొదలగు సాగు మెలకువలు వివరించి లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలు వైపు దృష్టిసాదించాలని సూచించారు.

ఉదయగిరిని జిల్లా చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి:శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఉదయగిరి మెట్ట ప్రాంతం ఉదయగిరి జిల్లా చేయాలని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఉద్యమ అధ్యక్షులు డాక్టర్ వేణుగోపాల్ కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు, ప్రజలు, మేధావులు, సామాజిక కార్యకర్తలతో రంగనాయకుల గుడి నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు భావితరాల భవిష్యత్తు ఒక్క ఉదయగిరి జిల్లాతోనే సాధ్యమని నినాదాలతో దద్దరిల్లిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల్ ఉద్యమ ప్రధాన కార్యదర్శి దస్తగిరి అహ్మద్, పలువురు ప్రజా సంఘ నేతలు మాట్లాడుతూ ఉదయగిరి మెట్ట ప్రాంత అభివృద్ధికి జిల్లా ఒకటే మార్గమన్నారు.జిల్లాలో వెనుకబడిన మెట్ట ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఉదయగిరి ప్రత్యేక జిల్లాగా ఏర్పడటమే ఏకైక మార్గమన్నారు.

రీ సర్వేపై రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి-ఉదయగిరి:మండలంలోని తిరుమలాపురం గ్రామంలో గురువారం రీ సర్వే పై రెవెన్యూ సదస్సు గ్రామ సభను సర్పంచ్ కొల్లుబోయిన కృష్ణ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎం సుభద్ర రీ సర్వే కార్యక్రమంపై పలు ఆక్షేపణలు, అభ్యంతరాలు భూ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం స్వీకరించిన అర్జీలకు సత్వర సమస్యల పరిష్కారానికి సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు.కార్యక్రమంలో విఆర్ ఒ అనూష గ్రామ రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-కావలి:గెలుపే లక్ష్యంగా ఆత్మ విశ్వాసంతో క్రీడల్లో పోటీ పడాలని డి.బి.ఎస్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు పేర్కొన్నారు. గురువారం రెండవ రోజు డి.బి.ఎస్ ఇంజినీరిం గ్ కళాశాల వేదికగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో అండర్ 19, 68వ అంతర్ జిల్లా స్థాయికబడ్డీపోటీలు ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథి గా దామిశెట్టి సుదీర్ నాయుడు పాల్గొన్నారు. క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ గెలుపు ఓటమితో సంబంధం లేకుండా జట్టు విజయమే లక్ష్యంగా పోరాడి ఆసియా క్రీడల స్థాయిలో కబాడీ ఆడేలామిమ్మల్నిమీరుతీర్చిదిద్దుకోవాలని సూచించారు.

కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

లోక్ అదాలత్ పై అవగాహన

ప్రజాశక్తి-జలదంకి:

సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్ సేవలు వినియోగించుకోవాలని కావలి లోక్ ఆ దాలత్ సభ్యులు ఎం.మాలకొండ రెడ్డి తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టుకు రానివి, పెండింగ్ కేసులు ఖర్చు కాలయాపన లేకుండా అంతిమ తీర్పును లోక్ అదాలత్ లో ఇవ్వడం జరుగుతుందన్నారుకావలి సబ్ కోర్టు ఆవరణలో న్యాయమూర్తుల ఆధ్వర్యంలో రాజీలు ద్వారా పరిష్కారం మార్గం దొరుకుతుందన్నారు

ఉపాధి హామీ పనులు వేగవంతం

ప్రజాశక్తి-వింజమూరు

ఉపాధిహామీ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ ఒ ఆనంద్ తెలిపారు. జిల్లాలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం అభివృద్ధి పనుల్లో భాగంగా గురువారం కలెక్టర్ ఆనంద్ వింజమూరు మండలంలోని అభివృద్ధి పనులను పరిశీలించారు. అందులో భాగంగా మండలంలోని నందికుంట గ్రామంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న అంతర్గత సిమెంట్ రోడ్లను నిర్మాణాన్ని పరిశీలించినారు. అంగన్వాడి స్కూల్ లను రికార్డును పరిశీలించి అంగన్వాడి స్కూల్లో చిన్నారులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కొంతసేపు చిన్నారితో ముచ్చటించారు. మండల పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ అభివృద్ధి పథకాల సంబంధించిన అధికారులు అందరికి జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వింజమూరు మండల పరిధిలోని జరుగుతున్న నాటూరు నేడు పనులను వాటి వివరాలను కూడా వాకప్ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు వేగంగా జరుగుతున్నాయని 80 కోట్ల రూపాయలతో సిమెంట్ రోడ్లు గోకులాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ పనులను కూడా రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. 1300 పైగా మినీ గోకులాలని ఏర్పాటు చేశామని 100 కి పైగా పూర్తి అయినట్లు కలెక్టర్ తెలిపారు మిగిలిన కూడా త్వరలోనే పూర్తి చేస్తామని పశువుల సంరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెరిగే దానికి అందరిలో ఒక అవగాహన కలిగించాలని దీంతో గ్రామాలలో అభివద్ధి పనులు ఎక్కువగా మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని 500 అంగన్వాడి కేంద్రాలలో మరుగుదొడ్లు మంచినీటి సౌకర్యం కల్పించేందుకు ఆర్డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో పనులు మొదలయ్యాయని తెలిపారు. లెక్టర్ వెంట కావలి ఆర్డిఒ వంశీకృష్ణ, ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగ భవాని, పంచాయతీరాజ్ ఎస్ఇ అశోక్ కుమార్, తహశీల్దార్, ఎంపీడీఓ, మండలాధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

విష ప్రచారాలు మానుకోవాలి:మాజీ ఎంఎల్ఎ

ప్రజాశక్తి-కావలి

తమపై జరుగుతున్న దుష్ప్రచారాలపై మున్సిపల్ కమిషనర్ జి. శ్రావణ్ కుమార్ ని మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి నిలదీశారు.గురువారం అయన కమిషనర్ ని కలిసి మాట్లాడారు.ఎంతో ఓపిగ్గా ఉన్నప్పటికీ తనపై పచ్చ మీడియా చేస్తున్న విష ప్రచారాలపై ప్రజలకు నిజానిజాలు తెలియాలని, మున్సిపల్ కార్యాల యానికి రావడం జరిగిందని తెలిపారు.2019 నుండి 2024 వరకు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 128 ఎకరాలు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి,కాలువలు గుంటలు ఆక్యుపై చేసి లేఅవుట్లు వేసి అమ్మి వేసినట్లుగా దుష్ప్రచారం చేస్తున్నార న్నారు."మేము అధికారంలో ఉన్నప్పుడు ఎవరైనా సరే ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్లుగా మా దృష్టికి తీసుకు రావలసిందిగా" అధికారులను ఆదేశించడం జరిగిందని తెలిపారు.ప్రస్తుతం 128 ఎకరాలు ప్రభుత్వ భూమి కబ్జాకి గురైనట్లు గా కమిషనర్ ప్రెస్ మీట్ పెట్టి తెలిపియున్నారు. సదరు విషయమై కమిషనర్ ని నిలదీయగా అది మా పరిధిలో లేదని ,రెవెన్యూ డిపార్ట్మెంట్ వారి పరిధిలో ఉన్నట్లుచెబు తున్నా రని, ఒకవేళ మున్సిపల్ కమిషనర్ తెలిపినట్లుగా 128 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురి అయినట్లయితే ప్రభుత్వం వారు సదరు భూమిని గుర్తించిస్వాధీనం చేసుకుని చుట్టూ ఫెన్సింగ్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ఉండవచ్చు కదా? అని నిలదీయుట జరిగింది. గతంలో జగనన్న లేఅవుట్ కోసం అప్పటి ఆర్డిఒ శీనా నాయక్ ని ప్రభుత్వ భూమి చూపమని కోరగా,కావలిలో ఎక్కడ ప్రభుత్వ భూమి లేదని తెలియజేసి ఉన్నారు. మరి అప్పుడు లేని ప్రభుత్వ భూమి ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎలా వచ్చిందో? అర్థం కావడం లేదని తెలిపారు.తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ భూమి కబ్జా అయిందని లేఅవుట్లలో ప్రవేశించి హడావుడి గా కాలువలు తీసి, స్థలాలు కొను క్కున్న వారిని భయభ్రాంతులకు గురిచేసి ఉన్నారు. ఎంతో కష్టపడి పేద ప్రజలు, రిటైర్ అయిన వారు,ఉద్యోగస్తులు తమ తమ రిటైర్మెంట్ అమౌంట్ గానీ, పి. ఎఫ్ అమౌంట్ గానీ,లేదా బ్యాంకు లోన్ ద్వారా ఇళ్లు కట్టుకుందాము కదా! అని లేఅవుట్లలో స్థలాలు కొనుక్కుంటే ఈ విధముగా ఆధారాలు లేకుండా కాలువలు తీసి, కొనుక్కున్న వారిని ఇబ్బంది పెట్టడం మంచి పద్ధతి కాదని తెలియజేశారు. మా పార్టీపై చేసే విష ప్రచారాలకు భయపడేది లేదన్నారు.అంతేకాకుండా మా పార్టీకి చెందిన సోషల్ మీడియా వారిపై అక్రమ కేసులు పెట్టడాన్ని ధైర్యంగాఎ దుర్కొంటా మని హెచ్చరించారు.

మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్కుమార్రెడ్డి

చెన్నూరులో పొలం బడి

ప్రజాశక్తి-దగదర్తి

మండలంలోని చెన్నూరు పంచాయతీలో పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కావలి సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు పాల్గొని విత్తన శుద్ధి పెట్టుబడులను తగ్గించుకునే విధానాల గురించి వివరించారు. వరిలో తొలిదశలో వచ్చే వివిధ రకాల తెగుళ్ల వాటి యాజమాన్య పద్ధతులను వివరించారు.కార్యక్రమంలో వ్యవసాయాధికారి అబ్దుల్ రహీం, వ్యవసాయ శాఖ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో గ్రామాభివృద్ధి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు అధికారులకు సహకారం అందించాలని అప్పుడే గ్రామ అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీపీ కేత వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు..గురువారం ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షుడు కేతా వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సర్వసభ్య సమావేశంలో అధికారులు శాఖల వారీగా పురోగతిని, చేపట్టబోయే పనుల వివరాలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. మహిమలూరు పిహెచ్సి వైద్యులు డాక్టర్ దేవానంద్ మాట్లాడుతూ ప్రస్తుతం సీజన్లో వ్యాధులు ప్రబలేందుకు అవకాశం ఉన్నందున మండలంలోని 11 సచివాలయాల పరిధిలో తమ వైద్య సిబ్బంది . ప్రతి ఇంటికి ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారని అన్నారు. జ్వరాలు అధికంగా ఉన్న గ్రామాలను గుర్తించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.. పంచాయతీరాజ్ ఏఈ ఖాదర్ బాషా మాట్లాడుతూ మండల పరిధిలో ప్రస్తుతం రూ.1.76 కోట్లతో 35 పనులు చేపడుతున్నామని డిసెంబర్ నాటికి వాటిని పూర్తి చేస్తామని వివరించారు. అంగన్వాడీ సూపర్వైజర్ రత్నమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు మరుగుదొడ్ల నిర్మాణాలను చేపడుతున్నామని, ఆయా గ్రామాలలో సర్పంచులు ప్రజా ప్రతినిధులు తమకు సహకారం అందిస్తే వాటిని త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొస్తామని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ శిరీష మాట్లాడుతూ ఉపాధి హామీ శాఖ ద్వారా మండలంలో 13943 మందికి పనులు కల్పించాల్సి ఉండగా 10,5447 మందికి ప్రస్తుత పనులు కల్పించామన్నారు. రానున్న రోజుల్లో ప్రాధాన్యత పనులు గుర్తించి వాటిని పూర్తి చేసేలా ప్రక్రియ చేపడతామని వివరించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచులు అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కేతా వేణుగోపాల్రెడ్డి

ఘనంగా ఎన్జి రంగా జయంతి

ప్రజాశక్తి-ఉదయగిరి:మేకపాటి గౌతమ్ రెడ్డి వ్యవసాయ కళాశాలలో ఎన్ జిరంగా జయంతి వేడుకలు ఆచార్య ఎన్ జిరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లో గురువారం జరిగాయి. అనంతరం ఆయన చిత్రపటానికి అసోసియేట్ డీన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అసోసియేట్ డీన్ అధ్యక్షత వహించి ఎన్జి రంగా గురించి విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆచార్య ఎన్జి రంగా గా ప్రసిద్ధుడైన గోగినేని రంగనాయకులు భారత స్వాతంత్ర్య సమరయోధుడు జాతీయవాది పార్లమెంటు సభ్యుడు రైతు నాయకుడు రైతాంగ విధానాలకు మద్దతునిచ్చిన ఈయనను భారత రైతాంగ ఉద్యమ పితగా భావిస్తారని భారత ప్రభుత్వం నుండి పద్మ విభూషణ్ పురస్కారం కూడా అందుకున్నారని గుర్తు చేశారు. 1930 నుంచి 1991 వరకు సుదీర్ఘకాలం భారత పార్లమెంటు సభ్యునిగా పనిచేశారని వివరించారు. ఎన్జీరంగా జీవిత చరిత్రను వివిధ రకాలుగా మూడవ సంవత్సరం విద్యార్థులు కె.మౌనిక, పి.నవ్య, వి.శివరాజు డి.వెంకటేష్ ఎస్ శ్రవణ్, టి.వెంకట కిరణ్మయి, కె.నవ్య రూప వివరించారు. కార్యక్రమంలో విద్యార్థుల కార్యకలాపాల అధికారి టి.గోపికృష్ణ, జాతీయ సేవా పథకం అధికారులు, డాక్టర్లు జి రమేష్, దుర్గాప్రసాద్, సునీత, శోభ, మాధవి, బోధనేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ఉదయగిరిలో నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కావలి

రైతు పక్షపాతిగా,ఆంధ్రప్రదేశ్లో ఆరు దశాబ్దాల పాటు పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసిన ఎన్జీరంగా పలువురికి ఆదర్శప్రాయుడని, కావలి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సి హెచ్.నాగరాజు పేర్కొన్నారు.ఆచార్య ఎన్జీరంగా జయంతి సందర్భంగా వ్యవసాయ శాఖ సహాయక సంచాలకులు కార్యాలయం ఆవరణలో వారి చిత్రపటానికి పూలమాలతో నివాళు లర్పించారు .నాగరాజు మాట్లాడుతూరైతుల రైతుల సంక్షేమం కొరకు గ్రామీణాభివద్ధికి నిరంతరం అభివద్ధి జరగాలని కలలు కన్న ఆచార్య ఎన్జీరంగా ప్రజాప్రతినిధులకు ఆదర్శప్రాయు డనిపేర్కొన్నారు.ఈకార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ప్రముఖ సామాజికవేత్త ఎం మాలకొండా రెడ్డి మాట్లాడారు.

కావలిలో

అదుపు తప్పి కారు బోల్తా.

ప్రజాశక్తి-మర్రిపాడు: నెల్లూరు.ముంబై జాతీయ రహదారి పై మర్రిపాడుకు సమీప ంలో రోడ్డు ప్రమాదం జరిగింది.పొంగూరు గ్రామానికి చెందిన వారు హైదరాబాద్ వెళు తుండగా అదుపు తప్పి కారు బోల్తాపడింది. కారులోప్రయాణిస్తున్న ఐదుగురిలో ఇద్దరికీ తీవ్రగా యాల య్యాయి..సమాచారం తెలుసు కున్న ఎస్ఐ శ్రీనివాస రావు సిబ్బం దితో కలసి హుటాహుటిన సంఘటనస్థ లానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

నగదు అందజేస్తున్న దృశ్యం

రూ.60వేలు నగదు దాతృత్వం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల మృతి చెందిన ఆరుగురు కుటుంబ సభ్యులకు శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, నిత్యాన్నదాత శ్రీ కంచి పరమేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.10,వేలు వంతున మొత్తం 60 వేలు నగదును దాతత్వం చేశారు.సంవత్సరం పైగా ఆత్మకూరు పట్టణంలో మృతి చెందిన ప్రజలకు, వారి ఖర్మకాండల ప్రక్రియ కోసం నిత్యాన్నదాత ,శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత శ్రీ కంచి పరమేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో మృతి చెందిన కుటుంబ సభ్యులకు చేస్తున్న రూ .10,వేలు ఆర్థిక సహాయం కార్యక్రమం ఆ పట్టణంలో నిర్విరామంగా కొనసా గుతుంది. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.

గ్రామసభలతో సమస్యలు పరిష్కారం.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం.: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభల వల్ల గతంలో జరిగిన సమస్యలను పరిష్కరించుకోవచ్చునని తహశీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని చెల్లాయ పాలెం గ్రామంలో గురువారం రెవెన్యూ గ్రామసభ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామసభలు నిర్వహించడం జరుగుతుం దన్నారు . గత ప్రభుత్వంలో రీ సర్వేలో తప్పులను సరి చేసేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రీసర్వేల్లో ప్రధానంగా ఐదు సమస్యలపై దృష్టి సారించామని చెప్పారు. విస్తీర్ణంలో వ్యత్యాసం,పట్టాదారు పేరు నమోదు, జాయింట్ ఫీల్డ్ విభజన, కోరిలేషన్ సవరణ, జాయింట్ ఫీల్డ్ మ్యుటేషన్ విభనజ వంటి సమస్యలపై తప్పిదం జరిగి ఉంటే రైతుల నుంచి అర్జీలు స్వీకరించి 45 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ గ్రామ సభ ద్వారా గ్రామసభ 14 అర్జీలు వచ్చాయని వీటిపై విచారణ చేసి త్వరితగతిన ఆయా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రంజిత్, నాయకులు మురళి, మల్లికార్జున పాల్గొన్నారు.

బడ్జెట్లో నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-కోవూరు:రాష్ట్రంలో ముస్లిముల మైనారిటీల సంక్షేమం కోసం ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో పలు హామీలను ఇవ్వడం జరిగింది. అందులో ప్రధానంగా మైనార్టీ విద్యార్థులకు ఉన్నత చదువులకై ఇతర దేశాలలో చదువుకునేందుకు అవకాశం కల్పించే విదేశీ విద్య పథకం అమలు. చేయాలి. దుల్హన్ పథకం ద్వారా పేద ముస్లిములకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం చేస్తామన్న హామీని వేంటనే అమలు చేయాలి. మైనారిటీలకు 5 లక్షల వరకు ఇస్తామన్న సబ్సిడీ లోన్లు ఇవ్వాలి. 50 సంవత్సరాలకే పెన్షన్ హామీని నిలబెట్టుకోవాలి. గత 6నెలల నుంచి పెండింగ్ లో ఉన్న ఇమామ్, మౌజన్ల జీతాలను వెంటనే విడుదల చేయాలి. మసీదులు, ఖబరస్థాన్ల అభివద్ధికి మరియు వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకై నిధులు కేటాయింపు పెంచాలి. జరగబోవు శాసనసభ సమావేశాల్లో తగిన బడ్జెట్ కేటాయింపులు చేసే విధంగా తమ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గండవరపు బుజ్జయ్య, ఆవాజ్ నాయకులు ఎస్ కే బాబు, చాంద్ బాషా, ఎస్డి సర్దార్ అహ్మద్, హుమయున్, బాబు మేస్త్రి, ఖాదర్ పాల్గొన్నారు.

వాటర్ కూలర్ వితరణ.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం: భక్తుల ప్రయోజనార్థం కోసం మండలంలోని జొన్నవాడ లో వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి సమేత శ్రీ కామాక్షిత అమ్మవారి ఆలయానికి దాతలు వాటర్ కూలర్ను గురువారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ ఆర్య భూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూస్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ చొరవలో భాగంగా, తిరుపతికి చెందిన ఎస్బిఐ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం డిప్యూటీ జనరల్ మేనేజర్ జి లేఖా మీనన్ దాదాపు 60 వేల విలువ కలిగిన వాటర్ కూలర్ను అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు అమ్మవారి దర్శనాన్ని కల్పించి వేద పండితులచే ప్రత్యేక పూజలు చేయించి శేష వస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్బిఐ రీజినల్ మేనేజర్ ఎన్ శ్రీనివాసరావు, ముఖ్యకార్యదర్శి ఆర్ శేషగిరి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కొండాపురం:మండలంలోని సాయి పేట పంచాయతీ ఇసుక పాలెంలో టిడిపి నాయకుడు దామశివ బాబు తండ్రి దామా మస్తానయ్య మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచన మేరకు కాకర్ల ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కావలి రెడ్ క్రాస్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన యువ కులు పెద్ద ఎత్తున వచ్చి రక్తదాన కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వంద మంది పైగా యువకులు పెద్దలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గంట లక్ష్మీనరసింహాలు, కుంకు మోహన్ రావు, మాజీ జెడ్పిటిసి దామామహేశ్వరరవు, మాజీ సర్పంచ్ బొల్లినేని వెంకటరమణయ్య పాల్గొన్నారు.

గోగులపల్లిలో వీధిలైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి-అనంతసాగరం: మండలంలోని గోగులపల్లి గ్రామంలో వీధి దీపాలు లేక రహదారులు చీకటి మయంగా మారింది. జనసేన ప్రధాన కార్యదర్శి నరసింహ రాయల్ చొరవతో పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో వీధిదీపాలు లేని సమస్య అడిగి తెలుసు కొని, స్పందించిన ఆత్మకూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి నలిశెట్టి శ్రీధర్, ఉపాధ్యక్షులు ఎంపీ భరత్, మండల జనసేన పార్టీ అధ్యక్షులు ఉదయగిరి రవి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మునగపాటి సునీత సుబ్బరాజు, బిజెపి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం

ప్రజాశక్తి-ఎఎస్పేట:మండల పరిధిలో ఎన్ఆర్ఇజిఎస్ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీఓ మాట్లా డుతూ... మండలం లోని అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పనులలో భాగంగా ప్రతి ఒక్క కుటుంబంలో ఇంకుడు గుంటలు ఏర్పాటు చేసుకునే విధంగా, రైతులు పశువులకు షెడ్ల నిర్మాణం ఏర్పాటు చేసుకోవా లని ఫీల్డ్ అసిస్టెంట్లకు తెలియజేశారు.

పరుగు పందెంలో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-అనంతసాగరం:మండలం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువు తున్న విద్యార్థి షేక్,మహీన్ శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి పరుగు పందెంలో రెండవ స్థానం సాధించి ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా ఎంఇఒ 2 కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రధానో పాధ్యాయురాలు బట్రెడ్డి లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు మెటుకూరు సుబ్బారెడ్డి, పోలంరెడ్డి చంద్రశేఖర్, శ్రీనివాసులు రెడ్డి, కృష్ణారెడ్డి, కేత సుబ్బారెడ్డి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ఇద్దరు నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి-ఉదయగిరి:మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సిఐ టి. లక్ష్మణ్ స్వామి పేర్కొన్నారు. గురువారం సీతారాం పురం మండలం, పోలం గారి పల్లెలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

నేడు స్కిల్ సెన్సెస్పై శిక్షణ...

ప్రజాశక్తి-వరికుంటపాడు:స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయానికి స్కిల్ సెన్సెస్ శిక్షణ కార్యక్రమం నిర్వహి స్తున్నట్లు ఎంపీడీఓ వేణుగోపాల రావు తెలిపారు. సచివాలయ పరిధిలోని సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. శిక్షణకు హాజరైనటువంటి సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి సెన్సెస్ చేయాలని సూచించారు. అందరూ తప్పకుండా సకాలంలో హాజరు అవి శిక్షణలో పూర్తి అంశాలు తెలుసుకోవాలని తెలిపారు.

పిఎం సూర్యఘర్ పై అవగాహన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్:ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీసంస్థ ఆత్మకూరు డివిజన్ వారి ఆధ్వర్యంలో ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో గురువారం పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకంపై అవగా హన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యఘర్ పథకం ప్రయోజనాలు, వాటికి వచ్చే సబ్సిడీల గురించి, విద్యుత్ వినియోగ దారులకు కలిగే ప్రయోజనాల గురించి తెలియచేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, ఆత్మకూరు సబ్ డివిజనల్ ఏడి సురేష్, టౌన్ ఏఈ లావణ్య, రూరల్ ఏఈ ప్రవీణ్, విద్యుత్,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజా సమస్యలపై ప్రజాపోరు

ప్రజాశక్తి-కావలి.:పట్టణంలో శుక్రవారం నుంచి ప్రజా సమస్యలపై ప్రజా పోరు కార్యక్రమం ప్రారంభ మవుతుందని ఆ పార్టీ కావలి పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య తెలిపారు.ఈనెల 8నుంచి 14వ తేదీ వారం రోజుల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అందుకు సంబంధించిన కరపత్రాలను గురువారం సిపిఐఎం ఆఫీసులో నాయకులు విడుదల చేశారు. ఈ సంద ర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పెరిగిన నిత్యావసర ధరలు, కరెంటు చార్జీలు తగ్గించాలని, ఉచిత ఇసుకను అమలు చేయాలని పట్టణ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇంకా అనేక ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించడం జరుగుతుందని తెలిపారు. చివరి రోజు 14వ తేదీన ప్రజలతో సమీకరించి ఆందోళన చేయడం జరుగు తుందని తెలిపారు. కార్యక్ర మంలో సిపిఎం నాయకులు వై.కృష్ణ మోహన్, జి.మధుసూదన రావు, బి.కృష్ణయ్య, వి.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE FAMILY COURT - CUM -V ADDL. DISTRICT COURT: TIRUPATI
O.E.P.No. 10/2024
K.Krishnaveni ...D.Hr
V/s
K.Krishna Reddy @ K.Krishnaiah ...J.Dr
NOTICE TO J.Dr U/o 21 R.22
K.Krishna Reddy @ K.Krishnaiah, aged about 65 years, residing at D.No.1-3-90, Kummaraveedhi, Mudhivarthi Vill, Vidualury Mandal, Nellore, SPSR Nellore (Dist.) A.P.
పై తెలిపిన కేసు నం.26.11.2024వ తేదికి పై కనిన కోర్టు వారు వాయిదా వేసివున్నారు. సదరు తేదిన ఉ॥ 10.30 లకు పై కనిన కోర్టుకు J.Dr గాని, J.Dr తరుపున లాయర్ ద్వారా గాని సదరు కోర్టుకు హాజరు కాగలరు. అలా హాజరు కాని పక్షంలో సదరు కోర్టువారు సదరు J.Dr పరోక్షంలో తదుపరి చర్యలు తీసుకోగలరు.
A.NIVEDITHA
A.CHANDRASEKHAR
Advocates
#21-5-32/C, Madhava Nagar, Tirupati
Cell: 9390303921, 7382685919